అంగరంగ వైభవంగా తోట నామినేషన్

- త్రిమూర్తులు రెండు, కుమారుడు పృథ్వీరాజ్ రెండు సెట్ల దాఖలు
- మూడు గంటలపాటు మండపేటలో భారీ ర్యాలీ
- క్రేన్‌ల సాయంతో గజమాలలు వేసిన అభిమానులు
- జనసంద్రమైన పట్టణం



మండపేటలో నామినేషన్ వేస్తున్న తోట పృథ్వీరాజ్



తోట త్రిమూర్తులు నామినేషన్ ర్యాలీలో వైఎస్సార్ సీపీ శ్రేణుల కోలాహలం

మండపేట: వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం కోలాహలంగా నామినేషన్ వేశారు. ఆయన రెండు సెట్లు, ఆయన కుమారుడైన తోట పృథ్వీరాజు మరో రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పట్టణం లోని విజయలక్ష్మీ నగర్లో ఉన్న ఆ పార్టీ కార్యాలయానికి ఉదయం 9 గంటలకే భారీ ఎత్తున తరలి వచ్చారు. తోట విజయాన్ని ఆకాంక్షిస్తూ కార్యాలయం ఆవరణలో తొలుత ముస్లిం, క్రైస్తవ మతాల పెద్దలు, వేద పండితులు వేర్వేరుగా సర్వమత ప్రార్థనలు నిర్వహించి, ఆయనకు ఆశీస్సులు అందించారు. అనంతరం త్రిమూర్తులు ప్రత్యేకంగా అలంకరించిన పూలరథం ఎక్కి ప్రజలకు, కార్యకర్తలకు, అభివాదం తెలుపుతూ ఊరేగింపుగా నామినేషన్ దాఖలుకు పయనమయ్యారు. మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, కౌన్సిలర్లు ఆయన వెంట ఉన్నారు. రాజారత్న జంక్షన్, బస్టాండ్ మీదుగా ర్యాలీ వాణీమహల్ వద్దకు చేరుకోగానే అక్కడి ముస్లింలు అభ్యర్థి తోట త్రిమూర్తులుకు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ సోదరులు ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ గలమాలను క్రేన్ సాయంతో తోట త్రిమూర్తులు మెడలో వేశారు.

భానుడి భగభగలు లెక్కచేయకుండా..

బుధవారం మండపేట పట్టణంలో ఎండ భీకరంగా ఉంది. ఉదయం 10 గంటల కాకముందే సూర్యుడు నిప్పులు చెరిగాడు. అయినప్పటికీ ఏమాత్రం లెక్క చేయకుండా వేలాది మంది ర్యాలీలో పాల్గొన్నారు. దారి పొడవునా 'జై తోట.. జై జగన్' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. సూర్య మహల్, వాణీమహల్ తదితర ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి కార్యకర్తలకు మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేశారు. ర్యాలీ కోలాహలంగా కలువపువ్వు సెంటర్‌కు చేరుకునే సరికి ఏఎంసీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు క్రేన్ సహాయంతో భారీ గజమాలను తోట మెడలో వేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. కాగా సోమేశ్వరం సర్పంచ్ నిమ్మకాయల ఆరిఫ్ స్థానిక కలువ పువ్వు సెంటర్ కేపీ రోడ్డులో ఏర్పాటు చేసిన 100 అడుగుల అతిపెద్ద ఫ్లెక్సీతో తోట త్రిమూర్తులుకు ఘన స్వాగతం చెప్పారు. ఈ ఫ్లెక్సీని కాకినాడ నుంచి ప్రత్యేకంగా రప్పించిన భారీ క్రేన్‌కు అమర్చి స్వాగతం పలకడం విశేషం. ఊరేగింపు కేపీ రోడ్డులోని గోల్డ్ మార్కెట్ వద్దకు వచ్చేసరికి ప్రముఖ వ్యాపారి, వైఎస్సార్ సీపీ నాయకుడు కొమ్ము రాంబాబు ఆధ్వర్యంలో భారీ గజమాలను క్రేన్ సాయంతో తోట త్రిమూర్తులు మెడలో వేశారు. ర్యాలీ జరిగిన మూడు గంటలూ ట్రాఫిక్‌ను బైపాస్ రోడ్డుకు మళ్లించారు. ద్విచక్ర వాహనాలను మాత్రమే పట్టణంలోకి అనుమతించారు. ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ నేత వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరితో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారి కార్యాలయానికి మధ్యాహ్నం ఒంటి గంటకు త్రిమూర్తులు చేరుకున్నారు. అభ్యర్థి తోట త్రిమూర్తులు రెండు సెట్లు, ఆయన కుమారుడు తోట పృథ్వీరాజ్ మరో రెండు సెట్ల నామినేషన్లను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి యల్లారావుకు అందజేశారు. కనీవినీ ఎరుగని రీతిలో దాదాపు 15 వేల మంది ఈ నామినేషన్ వేడుకలో పాల్గొనడం విశేషం.



ర్యాలీలో తోట త్రిమూర్తులుకు క్రేన్ సాయంతో గజమాల వేస్తున్న అభిమానులు

భారీ బందోబస్తు..

తోట త్రిమూర్తులు నామినేషన్ సందర్భంగా రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మండపేట రూరల్, టౌన్ సీఐలు కొమ్ముల శ్రీధర్‌కుమార్, షేక్ అఖిల్ జమ ఆధ్వర్యంలో అంగర, రాయవరం, మండపేట టౌన్, రూరల్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది, ప్రత్యేక బలగాలు భద్రతా విధులు నిర్వహించాయి.

సేవలను బేరీజు వేసుకుని ఓటేయండి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు



మండపేట: నియోజకవర్గానికి వేగుళ్ల జోగేశ్వరరావు 15 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా పని చేస్తే, తాను గత మూడున్నరేళ్లుగానే ఇక్కడి ప్రజలకు సేవ చేశానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు అన్నారు. తమ ఇద్దరి సేవలను బేరీజు వేసుకుని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేయాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం మండపేటలో బుధవారం తోట విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలనను చూసి ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. గత మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సాధించిన ఘన విజయాలే ఇందుకు సాక్ష్యాలని ఆయనన్నారు. వేగుళ్ల జోగేశ్వరరావు నామినేషన్ ర్యాలీకి టీడీపీ కార్యకర్తల బైక్‌లకు పెట్రోలు పోయించడానికి బంకులో కూపన్లు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే తమ పార్టీ కార్యకర్తలు బుధవారం స్వచ్ఛందంగా తమ పనులు మానుకుని మండు వేసవిలో నామినేషన్ ర్యాలీకి వచ్చారని త్రిమూర్తులు అన్నారు. వారందరి సంక్షేమానికీ తాను పాటుపడతానన్నారు. సీఎం వైఎస్ జగన్ బలపరిచిన అభ్యర్థులైన తనను, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును ఆశీర్వదించాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చల్లా ప్రభాకరరావు, నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కార్యక్రమాలు



వడ్లమూరులో శ్రామికులకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కపిలేశ్వరపురం: వడదెబ్బ ప్రభావాలపై మండలంలోని అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం వైద్య ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి కరుణేంద్రకుమారి పర్యవేక్షణలో వడ్లమూరు, వల్లూరు, నేలటూరు, గ్రామాల్లో శ్రామికుల పని ప్రదేశాల్లో పర్యటించారు. ఎండ తీవ్రత ఎక్కువ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు వినియోగం తీరును ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

చలివేంద్రం ప్రారంభం

రామచంద్రపురం: స్థానిక విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షిర్డీసాయి కోదండరాముని ఆలయం వద్ద బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏటా వేసవిలో వాహనదారుల దాహార్తి తీర్చేందుకు ట్రస్ట్ నేతృత్వంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని ట్రస్ట్ ఫౌండర్ గంగాధర్ తెలిపారు. ఇందులో భాగంగా ఉషా ఆర్థిక సహకారంతో ప్రస్తుతం ఏర్పాటు చేశామన్నారు.

నాలుగు నామినేషన్ల దాఖలు

రామచంద్రపురం: రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ తెలిపారు. టీడీపీ తరఫున ఇదివరకే వాసంశెట్టి సుభాష్ ఒక సెట్ నామినేషన్ వేయగా, రెండో సెట్‌ను బుధవారం దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి కోటి శ్రీనివాసరావు ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా యర్రంశెట్టి వెంకట రామరాజు, మడికి చంద్రశేఖర్ నామినేషన్లు వేశారని ఆర్వో సుధాసాగర్ వెల్లడించారు. ఇప్పటివరకూ మొత్తం 17 మంది 24 సెట్ల నామినేషన్లను దాఖలు చేసినట్లు తెలిపారు.

టీడీపీ అభ్యర్థి వేగుళ్ల ప్రచారం

కపిలేశ్వరపురం: టీడీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం మండలంలోని నిడసనమెట్ట, నేలటూరు, అచ్యుతాపురం, వడ్లమూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థిగా తనను నాలుగో సారి గెలిపించాలని ఆయా గ్రామాల ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు

కపిలేశ్వరపురం: స్థానిక సచివాలయ -1 పరిధిలో చేపట్టిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన వాటర్ ట్యాంక్ పునాది పనులు సాగుతున్నాయి. 1,50,000 లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భాగ్యరాజ్ పర్యవేక్షణలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ కొండేటి అనూష పర్యవేక్షిస్తున్నారు.

ఫ్యాన్‌కు ఓటేస్తేనే సంక్షేమ పాలన



శేరిలంకలో ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌ను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు



బాపనయ్య చెరువు గ్రామంలో ప్రచారం చేస్తున్న దివ్యశ్రీ తదితరులు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్
- ఉత్సాహంగా ప్రచారం

కె.గంగవరం: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. బుధవారం శేరిలంక, బ్రహ్మపూరి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. కుల, మత బేధాల్లేకుండా టీడీపీ, జనసేన పార్టీల వారికీ సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టికూటి రాజశేఖర్, ఎంపీపీ పంపన నాగమణి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, యండగండి సర్పంచ్ చోడే గోవిందు (దత్తుడు), సర్పంచ్ కొండేపూడి భద్రరావు, మాజీ ఎంపీటీసీ చింతా వెంకటరమణ, ఎంపీటీసీ కొండేపూడి గంగాభవాని అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. రామచంద్రపురం రూరల్: బాపనయ్య చెరువు గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌కు మద్దతుగా ఆయన సతీమణి పిల్లి దివ్యశ్రీ ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ పిల్లి సూర్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కాగా దివ్యశ్రీ ప్రచారానికి మహిళల నుంచి పెద్దఎత్తున మద్దతు లభించింది. వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీ ఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో బీసీలకు ప్రాధాన్యం

కాజులూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు తగిన ప్రాధాన్యం లభించిందని వైఎస్సార్ సీపీ నేత, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ అన్నారు. కాజులూరు శివారు చాకిరేవుమెరకలో జరిగిన బీసీ శ్రేణుల సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నాయే తప్ప ఎటువంటి ప్రయోజనాలు చేకూర్చలేదన్నారు. సీఎం జగనన్న బీసీలను అన్నింటా ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఎన్నికలలో బీసీలంతా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న వెంకటరమణ, సుబ్బరామారెడ్డి తదితరులు

రాయవరం: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న జగనన్నను మళ్లీ గెలిపించి అధికారంలోకి తీసుకు రావాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి కోరారు. రాయవరంలో బుధవారం వారు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని చేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ గత ఐదేళ్ల సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు చేరవేశామన్నారు. జగన్ పాలనలో అందిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి చూసి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేయాలని వారు కోరారు. మండపేట అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌ల గెలిపించాలని కోరారు. సర్పంచ్ చంద్రముల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు గంటి రోజా, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట సెగ్మెంట్‌కు 13 నామినేషన్ల దాఖలు

మండపేట: నామినేషన్ల దాఖలుకు ఏడో రోజైన బుధవారం మండపేట అసెంబ్లీ స్థానానికి పది మంది అభ్యర్థులు 13 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్టు మండపేట అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎల్లారావు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు రెండు సెట్లు, ఆయన కుమారుడు తోట పృథ్వీరాజ్ మరో రెండు సెట్లు, , టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు మరో రెండు సెట్లు, ఆయన అల్లుడు వల్లూరి సాయికుమార్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కామన ప్రభాకరరావు ఒక సెట్, ఆయన సతీమణి కామన సత్యవాణి ఒక సెట్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కోన సూర్యభాస్కరరావు, రాయుడు శ్రీనివాస్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నల్లా చిన్నారావు ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్లారావు తెలిపారు.

తోట నామినేషన్‌కు హుషారుగా అభిమానులు

కపిలేశ్వరపురం: బుధవారం నిర్వహించిన తోట త్రిమూర్తులు నామినేషన్ కార్యక్రమానికి మండలంలోని 19 గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ఎమ్మెల్సీ అభిమానులు వేలాదిగా మండపేటకు తరలి వెళ్లారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల నుంచి కార్యకర్తలు ప్రత్యేకంగా సమకూర్చుకున్న వాహనాల్లో తరలివెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగునలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం గోవిందు, సర్పంచ్‌ల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, 19 గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి 'కామన' నామినేషన్

మండపేట: కాంగ్రెస్ పార్టీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు బుధవారం ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే ఆయన సతీమణి కామన సత్యవాణి కాంగ్రెస్ అభ్యర్థిగా మరొక సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారి ఎల్లారావుకు అందజేశారు.

కోతల కాలం.. జాగ్రత్తలు అవసరం

పంట కోతల్లో అప్రమత్తతతో దిగుబడులు

కాజులూరు: జిల్లాలోని డెల్టా ప్రాంతాల్లో వరి పంట ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. దిగుబడి ఆశాజనకంగా ఉండి వాతావరణం అనుకూలంగా ఉండటంతో పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు తొందర పడుతున్నారు. అయితే పంట కోతల సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టం తీవ్రంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో గింజ నాణ్యత తగ్గిపోతే కొనుగోలుదారులు పంట కొనకపోవటం, లేదా ధర తగ్గించడం జరుగుతుంది. కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ వివరించారు. అవి ఆయన మాటల్లోనే...

కోతలకు ముందు పంట రకాన్ని బట్టి పంట కాలవ్యవధి ఎన్నిరోజులు అనేది ముందుగా గుర్తించాలి. కంకిలోని చివరి గింజ తోడుకునేంత వరకూ పంట కోయరాదు. వరి గింజ పంటి కింద ఉంచి కొరికినప్పుడు పట్ మని శబ్దంతో గింజ విరగాలి. పంట కోత సమయానికి 10 రోజుల ముందు పొలంలో నీటిని పూర్తిగా తీసివేయాలి. వరి పనలు కోసిన తర్వాత రెండు రోజులు ఆరనిచ్చి తిరగవేసి మరో రెండు రోజులు ఎండనిచ్చి మాసూళ్లు చేసుకోవాలి. గింజలో తేమ 17 శాతం ఉన్నప్పుడే మంచి ధర వస్తుంది. కాబట్టి పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోత కోయాలి. విత్తన వరి పంట సాధారణ పంట కంటే 15 నుంచి 20 రోజులు ముందుగానే కోతకు వస్తుంది. విత్తన వరి సాగు చేసిన పొలాల్లో కోత సమయంలో పక్కపొలం నుంచి నీరు రాకుండా ముందుగానే గట్టు ఎత్తుగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. ఉదయం మంచు ఆరిన తర్వాతే కోత ప్రారంభించాలి. వరి కోతలో యంత్రాలను వినియోగిస్తే అది సక్రమంగా పనిచేస్తుందో లేదో గమనించాలి. లేకుంటే గింజలు నష్టపోయే ప్రమాదం ఉంది. కోత సమయంలో మొక్క కింద భాగం కంకి వరకు కోయాలి. దాళ్వా పంట అనంతరం పొలంలో అపరాలు చల్లుకునే వారు కోత కోసేందుకు నాలుగు రోజుల ముందే పొలంలో తడి పదునుపై అపరాల విత్తనాలు చల్లుకోవాలి.



కాజులూరులో వరి పంట కోస్తున్న రైతులు

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయంలో నిత్యాన్నదానం ట్రస్టుకు పాశర్లపూడిబాడవకు చెందిన ఆకుల స్వామి నాయుడు, పద్మ దంపతులు బుధవారం రూ.22,720 విరాళంగా అందించారు. తమ కుమారుడు ఆకుల రామకృష్ణ జ్ఞాపకార్థం ఏటా ఏప్రిల్ 28న అన్నదానం చేయాలని కోరారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

నాగుల్లంకలో శివాలయానికి శంకుస్థాపన

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామంలో రూ.3 కోట్లతో ఉమానాగలింగేశ్వర స్వామివారి ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో వివిధ పూజలు జరిగాయి. స్థానికులతో పాటు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. ఆలయ నిర్మాణానికి కసుకుర్తి లక్ష్మి, ఆమె కుమారుడు శ్రీధర్ 15 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. కార్యక్రమాల్లో సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, పాలూరి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండుటెండకు నిండు ముసుగు

మండుటెండలతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో పలువురు ప్రయాణం సాగించక తప్పడం లేదు. ఉపాధి, శుభకార్యాలు, ఇతర అవసరాల నిమిత్తం ప్రయాణిస్తున్నారు. మండుటెండకు నిండా ముసుగుతో కన్పించిన దృశ్యాలు వేసవి ప్రభావాన్ని చెప్పకనే చెబుతున్నాయి. – రాయవరం







మండుటెండకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ వెళుతున్న ప్రయాణికులు

క్లుప్తంగా

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

కాజులూరు: వేసవిలో చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బందికి వేసవి తీవ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీలైనంతవరకూ తల్లిదండ్రులు పిల్లలను ఎండలోకి వెళ్లకుండా చూడాలన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది నారాళ రాజారావు, ఇ.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు మరే సీఎం సాటిరారు

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్



మండపేట: దేశంలో ఇప్పటి వరకూ పని చేసిన ముఖ్యమంత్రుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎవరూ సాటి రారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం మండపేటలో తోట త్రిమూర్తులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం బోస్ విలేకరులతో మాట్లాడారు. స్వతంత్ర్యం వచ్చాక రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి హయాం లోనే మెరుగైన సంక్షేమం, అభివృద్ధి జరిగాయన్నారు. నూరు శాతం సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు వారి ఇళ్లకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దే అన్నారు. బడ్జెట్లో కేటాయింపులు, అనుకున్నది వెంటనే పూర్తి చేయడం, హామీలు అమలు మొదలైనవి జగన్ పని తనానికి నిదర్శనమన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 99 శాతం హామీలను అమలు పరచిన ఘనత ముఖ్యమంత్రిది అన్నారు. సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఓట్లు వేస్తారని బోసు అన్నారు. రాష్ట్రంలో రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

వైభవంగా భీమేశ్వరునికి పూజలు



కళావాహన పూజలు చేస్తున్న పండితులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో బుధవారం ఉదయం భీమేశ్వరుని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కేంద్ర పురావస్తు శాఖ అధికారుల ఆదేశాలను అనుసరిస్తూ దేవదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షణలో స్వామివారి ఆలయంలో కళా వాహన పూజలు చేశారు. మరమ్మతుల కారణంగా స్వామి, అమ్మవార్లకు ఆలయంలోని నంది మంటపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 30 వరకూ స్వామివారి నిత్య కైంకర్యాలు, నిత్య ఆరాధనలు, త్రికాల అర్చనలు, ఆర్జితసేవలు ఇక్కడే కొనసాగించనున్నారు. దేవులపల్లి ఫణిరామకృష్ణ ఆధ్వర్యంలో వేదపండితుల బృందం సంకల్పం, గణపతి పూజ, కలశ స్థాపన చేశారు.

ఘనంగా ఆరాధనోత్సవం

ద్రాక్షారామలోని శ్రీసత్యసాయి మందిరంలో శ్రీసత్యసాయిబాబా ఆరాధనోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన, ప్రశాంతి పతాక ఆవిష్కరణ, స్వామి అష్టోత్తర పూజలు, సాయి గాయత్రీ నామజప కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ కన్వీనర్ విస్సాప్రగడ కృష్ణమూర్తి, ఏడిద రాజారావు, కేఎస్ పాపాజీ, పెన్నాడ వెంకట్రావు, అజ్జరపు విజయలక్ష్మి పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో త్రిమూర్తులు పూజలు



అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయంలో తోట త్రిమూర్తులు దంపతుల పూజలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో మండపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు కుటుంబ సమేతంగా బుధవారం పూజలు నిర్వహించారు. సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పూజలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో స్వామిని దర్శించి నామినేషన్ వేయడం తనకు ఆనాయితీగా వస్తుందని ఆయన అన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆయన వెంట కుమారుడు పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

26న సత్యనారాయణ స్వామి పునఃప్రతిష్ఠ

రాయవరం: వెదురుపాక గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో శ్రీరమా వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠ యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ధర్మకర్తల కమిటీ బుధవారం విలేకరులకు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం చేరోద్వరణ పూజలు నిర్వహించారు. గురువారం అధివాసాలు, 26న శ్రీవైఖానస పీఠం, శ్రీమాన్ వాడపల్లి గోపాలాచార్యుల అర్చకత్వంలో స్వామివారి పునఃప్రతిష్ఠ యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన చేస్తామన్నారు. భక్తులంతా హాజరు కావాలని కోరారు.